క్లుప్తంగా

పెదవలస సీహెచ్‌వో బదిలీ



సీహెచ్‌వో శ్రీనివాసరావు

గూడెంకొత్తవీధి: పెదవలస ప్రాథమిక ఆస్పత్రి ఆరోగ్య అధికారి సబ్బవరపు శ్రీనివాసరావుకు బదిలీ అయింది. పెదవలస ఆస్పత్రిలో ఆయన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. జీకే వీధి, చింతపల్లి మండలాల్లోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 15 సంవత్సరాల పైబడి ఆయన విధులు నిర్వహించారు. పెదవలస పీహెచ్‌సీ నుంచి ఆయన బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. తాజాగా సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి జిల్లా పెనుగొండ ఆస్పత్రికి ఆయన బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీహెచ్‌వో పోస్టు భర్తీ చేయాల్సి ఉంది.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: మండలంలోని రింతాడ పంచాయతీ గుర్రాలగొంది ఆదర్శ పాఠశాలను తహసీల్దార్ రామకృష్ణ శనివారం సందర్శించారు. విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని కోరారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేదని, పాఠశాలకు ప్రహరీ లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తహసీల్దార్ రామకృష్ణకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన రహదారి సౌకర్యంపై గిరిజన సంక్షేమ శాఖ డీఈ దృష్టికి తీసుకెళ్తామన్నారు. హెచ్‌ఎం జ్యోతిబాయి పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



చీడిపాలెంలో పర్యటిస్తున్న వైద్యాధికారి భావన, సిబ్బంది

గంగవరం : స్థానిక పిహెచ్‌సీ వైద్యాధికారి భావన ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది బృందం మండలంలో చీడి పాలెం, కొత్త గంగవరం, పి.పి.పాలెం, పంద్రప్రోలు గ్రామాల్లో శనివారం పర్యటించారు. మలేరియా సర్వే చేశారు. మండలంలో మలేరియా కేసులు అధికమవుతున్నాయని గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి భావన సూచించారు. ఇంటి ఆవరణల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వ వల్ల లార్వా పెరిగి మలేరియా దోమలు వ్యాప్తి పెరుగుతోందన్నారు.150 మందికి రక్తపరీక్షలు చేశారు. సీహెచ్‌వో మేరీ, సిబ్బంది మూర్తి, నూకరత్నం, నాగమణి తదితరులున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ పాపారావు

గూడెంకొత్తవీధి: మండలంలోని శివారు ప్రాంతమైన గుమ్మిరేవులలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు శనివారం పర్యటించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. డ్రైనేజీలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లోను బ్లీచింగ్ వేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పంచాయతీలో శానిటేషన్ డ్రైవ్‌ను చేపడుతున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తడ చెత్త, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా తీసుకుని అన్ని పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ పాపారావు, సర్పంచ్ కమలమ్మ తదితరులున్నారు.

పీవీ నరసింహారావుకు ఘన నివాళి



కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, గ్రామస్తులు

అడ్డతీగల: మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు జయంతి కార్యక్రమాన్ని ఏపీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్తిబాబు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి దేశ ప్రధానిగా పనిచేసి అనేక ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశాభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు.

చిత్తడి దారులతో సతమతం



చీమకొండ ఘాట్ రోడ్డు దుస్థితి



రాళ్లుతేలిన రహదారి

- అధ్వానంగా సీమకొండ ఘాట్ రోడ్డు
- చిత్తడి దారితో సతమతం
- అత్యవసర సేవలకు అంతరాయం
- పట్టించుకోని యంత్రాంగం

పెదబయలు: మండలంలోని ప్రధాన రోడ్లు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మన్యంలో రహదారులపై కనీసం దృష్టి సారించలేదు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు తారురోడ్డు మట్టి రోడ్లను తలపిస్తుంది. మండలంలోని గోమంగి రాయిమామిడి జంక్షన్ నుంచి గుల్లేలు మీదుగా ఇంజరి పంచాయతీ కేంద్రం వరకు తారురోడ్డు నిర్మాణం జరిగింది. రాయిమామిడి జంక్షన్ నుంచి జంగంపుట్టు 9 కిలో మీటర్లు తారురోడ్డు 12 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ రహదారి నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం వల్ల అధ్వానంగా మారింది. ప్రస్తుతం ఈ రోడ్డు తారురోడ్డు కాస్త మట్టి రోడ్డును తలపిస్తోంది. గుల్లేలు కాజ్‌వే సమీపంలో, చీమకొండ ఘాట్‌లో పూర్తిగా తారు రోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారింది. ఈ రహదారిపై భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో పాటు గడిచిన ఆరు నెలల్లో భారీ వర్షాలతో కొండచరియలు విరిగి పడడంతో ఈ మార్గం గోతులమయమైంది. ఇటీవల కర్రల లోడ్‌తో వస్తున్న వాహనాలతో రోడ్డు మరింతగా పాడైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాహనాలు ఈ మార్గం మీదుగా వెళ్లేందుకు మరింత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఈ మార్గంలో గుల్లేలు, బొంగరం, గిన్నెలకోట, ఇంజరి పంచాయతీలకు చెందిన గ్రామాలున్నారు. అధ్వాన రహదారి వల్ల అత్యవసర సేవలు అందక అవస్థలు పడుతున్నామని ఆయా గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

పర్యాటకులకు తప్పని అవస్థలు

పెదబయలు మండలంలో ప్రసిద్ధి చెందిన పిట్టలబొర్రా(తారాబు) జలపాతం, ఇనుపతీగల జలపాతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. ఈ రోడ్డు మీదుగా పర్యాటకులు ఆయా ప్రాంతాలకు వెళ్తుంటారు. ఈ మార్గంలో సుమారు 9 కిలోమీటర్లు రోడ్డు బాగా లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కప్పలగొంది గ్రామ సమీపం నుంచి పెదవంచరంగి మీదుగా డోమలొడ్డు, లింగారిపుట్టు గ్రామాలకు అనుసంధానం చేస్తూ నిర్మాణం చేయాల్సిన మెటల్ రోడ్డు అసంపూర్తిగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రహదారుల సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

తారురోడ్డు నిర్మించాలి



మండలంలోని రాయిమామిడి జంక్షన్ నుంచి జంగంపుట్టు వరకు తారురోడ్డు పూర్తిగా పాడైంది. పెద్ద పెద్ద గుంతలున్నాయి. ముఖ్యంగా చీమకొండ ఘాట్ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. రోడ్డు బాగా లేని కారణంగా అత్యవసర 108, 104 వాహనాలు గ్రామాలకు రావడం లేదు.ద్విచక్రవాహనాలు కూడా వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డుకు మరమ్మతు చేయాలని అధికారులను అనేకమార్లు కోరుతున్నా స్పందించడం లేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మరింత ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తారురోడ్డు నిర్మించాలి.

– సాగేని నాగరాజు, మాజీ సర్పంచ్, గుల్లేలు పంచాయతీ, పెదబయలు మండలం

ప్రతిపాదనలు పంపాం



మండలంలోని పాడైన రహదారులకు మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి, ఐటీడీఏ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అలాగే ప్రధాన కాజ్‌వేల నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు చేశాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం. ఎక్కువ పంచాయతీలను అనుసంధానం చేసే రహదారుల మరమ్మతులక అధిక ప్రాధాన్యత ఇస్తాం.

– ఎల్. పూర్ణయ్య, ఎంపీడీవో, పెదబయలు

గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీటీసీ వంశీ

రంపచోడవరం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గోపవరంలోని పాఠశాలకు నాడు–నేడు ద్వారా రూ. 15 లక్షలు మంజూరైందని, సగం పనులు మాత్రమే జరిగాయని, కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా మిగిలిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోలేదని ఎంపీటీసీ కుంజం వంశీ తెలిపారు. మండలంలోని ఈతలపాడులో సర్పంచ్ మిర్తివాడ ఆనంద్ రెడ్డి అధ్యక్షతన ధర్తి అబ్ జన్‌భగీదరి అభియాన్ గ్రామసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ వంశీ మాట్లాడుతూ కన్నరం, బూరుగుబంద, గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల పనుల అసంపూర్తిగా ఉన్నాయన్నారు. నరసాపురం, కొత్తవీధి, తామరపల్లి– నూనెపల్లి గ్రామాల్లో రోడ్డు పనులకు మెటల్ వేసి వదిలేసినట్టు తెలిపారు. వీటిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. తామరపల్లి గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణ కోసం దరఖాస్తు చేసినా మంజూరు కావడం లేదన్నారు. సంబంధిత శాఖాధికారులు ఆయా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో జయంతి, వార్డు సభ్యులు గోపాల్, బాపనమ్మ, ఆర్ఐ నిర్మల, వెలుగు ఏపీఎం స్వామి తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాసురావు

వి.ఆర్.పురం: మండలంలోని చింతరేగిపల్లిలోని వనవాసి కళ్యాణాశ్రమం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 150 మంది రోగులకు డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. మండలంలో ప్రతి నెల 26, 27 తేదీల్లో వైద్యశిబిరం నిర్వహిస్తామని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ కో–ఆర్డినేటర్ ప్రసాద్ తెలిపారు.

నేడు మోహనాపురంలో వైద్య శిబిరం

గంగవరం: మండలంలోని మోహనాపురంలో ఆదివారం వనవాసి కళ్యాణాశ్రమం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు బి.కాటంరెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులతో వెంకటరామారావు

ఎటపాక: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా ఆకుల వెంకట రామారావు(పెద్దోడు) పేరును ప్రతిపాదించారు. మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో శనివారం జరిగిన మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ అనంతబాబు, రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సమక్షంలో ఈ తీర్మానం ప్రతిపాదించి పార్టీ అధిష్టానానికి పంపించారు. వెంకట రామారావు మండల పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. సొసైటీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

గ్రామసభలు నిలుపుదల చేయాలి



నినాదాలు చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

చింతూరు: వైల్డ్‌లైఫ్ నేషనల్ పార్క్‌ను ఆనుకుని ఉన్న గ్రామాలను ఖాళీ చేయించే కుట్రలో భాగంగా చేపడుతున్న ఎకోసెన్సిటివ్ జోన్ గ్రామ సభలను వెంటనే నిలుపుదల చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు సీసం సురేష్ డిమాండ్ చేశారు. మండలంలోని లక్కవరంలో శనివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రతో వైల్డ్‌లైఫ్ నేషనల్ పార్క్ ఆనుకుని ఉన్న పది కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో రెవెన్యూ, అటవీ సిబ్బంది గ్రామ సభలు నిర్వహిస్తున్నారని, వీటిని ఆదివాసీలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఏళ్ల తరబడిగా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ప్రకృతితో మమేకమై జీవనం సాగిస్తున్న ఆదివాసీల జీవనంపై ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నాయన్నారు. సహజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టే ప్రయత్నంలో భాగంగా ఎకోజోన్ పేరుతో ఆదివాసీలను వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తక్షణమే గ్రామసభలను నిలుపుదల చేయాలని, వచ్చే నెల 6న లక్కవరంలో గిరిజన సంఘం మండల మహాసభను నిర్వహిస్తున్నామని, ఆదివాసీలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. నేతలు నగేష్, లక్ష్మణ్, సుబ్బారావు, చిన్నయ్య, రామారావు, ముత్తయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైతు భరోసా కేంద్రం



కాశీపట్నంలో నిరుపయోగంగా రైతు బరోసా కేంద్రం

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని కాశీపట్నంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం(ఆర్‌బీకే) నిరుపయోగంగా మారి, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గిరిజన రైతులకు ఎంతో ఉపయోగంగా ఉండేందుకు అప్పటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ. 20లక్షలు వెచ్చించి రైతు భరోసా కేంద్రం భవనాన్ని నిర్మించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ రైతు భరోసా కేంద్రాల నిర్వహణను విస్మరించింది. దీంతో కాశీపట్నంలో ఉన్న ఆర్‌బీకే ప్రస్తుతం ఆయా కేంద్రాలు వినియోగంలో లేదు. దీనికి పక్కనే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఉంది. ప్రస్తుతం ఈ ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పంచాయతీ పాలకులు స్పందించి రైతు భరోసా కేంద్రంతో పాటు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఆత్మీయ సత్కారాలు



చింతపల్లిలో సత్యబాబు దంపతులను సత్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

చింతపల్లి: చింతపల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల–1 ఉపాధ్యాయుడు గొర్లె సత్యబాబు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రామరాజుపడాల్ అధ్యక్షతన సత్యబాబు దంపతులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో ప్రసాద్, ఏటీవో శంకరరావు, ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యు.వి.గిరి, ఏపీజీఈఏ సంఘం అధ్యక్షుడు పద్మనాభం, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన వెంకటరమణ, పలు పాఠశాలల హెచ్‌ఎంలు సింహాచలం, ఎస్.వి.రమణ, పీడీ రామకృష్ణ తదితరులు టీచర్ సత్యబాబు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సత్యబాబు చేసిన సేవలను కొనియాడారు.ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



గంగవరంలో డీటీ సుధాకర్‌రావు, సర్వేయర్ గిరిబాబును సన్మానిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

బదిలీపై వెళ్తున్న డీటీ, సర్వేయర్‌లకు ఘన సన్మానం

గంగవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్‌రావు, కమ్యూనిటీ సర్వేయర్ పి.గిరిబాబుల సేవలు అభినందనీయమని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఇక్కడ నుండి బదిలీపై వెళ్తున్న డిప్యూటీ తహసీల్దార సుధాకర్ రావు, కమ్యూనిటీ సర్వేయర్ గిరిబాబుల సన్మాన కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా వారిని తహసీల్దార్‌తో పాటు సహచర సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు అందించిన సేవలను తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు, సర్వేయర్లు వీరప్పదొర, లీలాకృష్ణ, వీఆర్వోలు వెంకటేశ్వర్లు, వెంకన్న, రామలక్ష్మి , రాజామణి, రవి తదితరులు కొనియాడారు. రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయిదు ట్రాక్టర్లు, పొక్లెయిన్ సీజ్

రాజవొమ్మంగి: రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ భూముల నుంచి గ్రావెల్ తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను, ఒక పొక్లెయిన్‌ను రెవెన్యూ అధికారులు శనివారం రాత్రి స్వాధీనం చేసుకొన్నారు. ఇక్కడ జరుగుతున్న మట్టి అక్రమ తరలింపు సమాచారాన్ని పలువురు సబ్ కలెక్టర్ కల్పశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాజవొమ్మంగి పంచాయతీలోని ముర్లవానిపాలెం వెళ్లి అక్కడ ప్రభుత్వ భూముల్లో పనిచేస్తున్న ట్రాక్టర్లను, మట్టి తవ్వే యంత్రాన్ని సీజ్ చేసి రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు తహసీల్దార్ అల్లు సత్యనారాయణ తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

జవాబుదారీతనం లేకుంటే ఎలా?

- సర్వసభ్య సమావేశంలో వెల్లువెత్తిన సమస్యలు
- అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల మండిపాటు



అధికారుల తీరును ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

చింతూరు: కొందరు అధికారులకు జవాబుదారీతనం లేకుండా పోయిందని, ప్రజా సమస్యలపై తాము ప్రశ్నిస్తుంటే అధికారులు వెళ్లిపోవడం ఎంతవరకు సబబని చింతూరు మండల ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సవలం అమల అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. పలు సమస్యల గురించి ప్రజా ప్రతినిధులు మాట్లాడుతున్న సమయంలో కొందరు అధికారులు బయటకు వెళ్లిపోయారు. దీనిపై మండిపడిన సర్పంచ్ కారం కన్నారావు, కో–ఆప్షన్ సభ్యుడు జిక్రియా అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులు తమ సమస్యలు వినకుండా బయటకు వెళ్లిపోతే ప్రజా సమస్యలు ఎలా పరిష్కరమవుతాయని ప్రశ్నించారు. బయటకు వెళ్లిపోయిన అధికారులు ప్రజా ప్రతినిధుల ఆగ్రహాన్ని గ్రహించి వెంటనే సమావేశం జరుగుతున్న హాలులోకి తిరిగివచ్చారు.

దారుణంగా విద్యావ్యవస్థ

మండలంలో విద్యావ్యవస్థ తీరు చాలా దారుణంగా ఉన్నట్టు పేగ, చింతూరు సర్పంచ్‌లు పాయం చంద్రయ్య, కారం కన్నారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో గతంలో ఎన్నడూలేని విధంగా దారుణమైన ఫలితాలు వచ్చాయని, తల్లికి వందనం సొమ్ములు చాలా మందికి జమకాలేదని వారు చెప్పారు. సొమ్ములు ఎందుకు జమకాలేదో నేటికీ కారణాలు చూపలేదని, కొంతమంది ఉద్యోగస్తులకు తల్లికి వందనం సొమ్ములు జమయ్యాయని వారి నుండి సొమ్ములు రికవరీ చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు గతేడాది ప్రభుత్వం ఇచ్చిన వరి విత్తనాలు సరిగా మొలకెత్తగా నష్టపోయారని ఈ ఏడాదైనా నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఈ ప్రాంతానికి అనువైన 1001, 1010 వరి వంగడాలను రైతులకు సబ్సిడీపై అందించడంతో పాటు పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సేంద్రియ వ్యవసాయంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని వారు కోరారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాస్‌దొర మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూములకు ముందుగా భూసార పరీక్షలు నిర్వహించి దానికి అనుగుణంగా విత్తనాలు సరఫరా జరిగేలా చూడాలన్నారు. చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న వరదలకు ముంపునకు గురయ్యే గ్రామాల్లో ముందుగానే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పించాలని ప్రజాప్రతినిధులు కోరారు.

అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు వాగుల వద్ద నాటు పడవలు సిద్ధంగా ఉంచాలని, వరద ముంపునకు గురైన ప్రతిఒక్కరికీ పరిహారం అందించాలని ఏజీకొడేరు సర్పంచ్ అగరం సుబ్బలక్ష్మి కోరారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని, పునరావాస కేంద్రాల్లో తాగునీటి సౌకర్యంతో పాటు శానిటేషన్ చేపట్టాలని ఆమె కోరారు. తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ వరదల సమయంలో వినియోగించేందుకు మండలంలో లాంచీలతో పాటు బోట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలో 1,100 మంది రేషన్‌కార్డులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరలోనే అందచేస్తామని, 820 మ్యుటేషన్ సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని కూడా త్వరితగతిన రైతులకు అందిస్తామని తెలిపారు. వైస్ ఎంపీపీ యడమ అర్జున్, ఏటీడబ్ల్యూవో కంచర్ల సుజాత, ఎంఈవో లక్ష్మీనారాయణ, ఏవో శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బట్టావారివీధిలో ఫీవర్ సర్వే



బట్టావారివీధిలో వైద్య శిబిరం

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు ప్రాంతం బట్టావారివీధిలో శనివారం మలేరియా, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఫీవర్ సర్వేలో నిర్వహించారు. 57 కుటుంబాల్లో మొత్తం 65 మందికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించి వారిని పరీక్షించారు. దోమల నివారణకు పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయవద్దని, దగ్గరలోని పీహెచ్‌సీకి వెళ్ల చికిత్స పొందాలన్నారు. మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ సోమరాజు, హెల్త్ అసిస్టెంట్ శామ్యూల్, సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాల భవనం పనులు పూర్తి చేయండి



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

పాడేరు రూరల్: మండలంలోని సలుగు పంచాయతీ లోలంపాడు పాఠశాల భవనం అసంపూర్తిగా ఉందని, తక్షణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు భాస్కరరావు, దేముడు, ఎండన్న, రామరావులు కోరారు. వారు శనివారం మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పాఠశాల భవనం అసంపూర్తిగా ఉందని, శిథిలావస్థకు చేరుకుంటుందన్నారు. గ్రామంలో అయిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా వేరే భవనంలో తరగతులు జరుగుతున్నాయన్నారు. పాఠశాల సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

గంగవరం: మండలంలోని మొల్లేరు గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఉద్యానవన శాఖాధికారి కె.ముత్తయ్య మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పతాంజలి ఫుడ్స్ కంపెనీ డీజీఎం ఎ.ఎస్.ప్రకాష్ ఆయిల్‌పామ్ సాగులో సస్యరక్షణ చర్యలను వివరించారు. రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను పంపిణీ చేశారు. మల్లవరం సర్పంచ్ అర్జున్‌రావు పాల్గొన్నారు.

భవనంపై పిచ్చి మొక్కను తొలగించండి



ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంపై పెరిగిన పిచ్చిమొక్క

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరం భవనంపై పెరిగిన మర్రి మొక్కను తొలగించాలని సర్పంచులు, ఎంపీటీసీలు కోరుతున్నారు. భవనంపై మర్రి మొక్క రోజు రోజుకు పెరుగుతుందని, దీంతో భవనం పైకప్పు రేకులు పాడైపోతున్నాయన్నారు. గోడలలోకి చెట్టు మొక్క వేర్లు వెళ్తుండడంతో గోడలు బీటలు వారాయి. నిత్యం మండలంలో వివిధ శాఖాల సమావేశాలు జరిగే సమావేశ మందిర భవనం పరిస్థితి ఈ విధంగా ఉండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు భయపడుతున్నారు. తక్షణమే మండల పరిషత్ అధికారులు భవనంపై పెరిగిన మర్రి మొక్కను తొలగించాలని, బీటలు వారిన గొడలను బాగు చేయాలని సర్పంచులు, ఎంపీటీసీలు కోరుతున్నారు.